క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి పనులపై చర్చ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్య నారాయణస్వామి ఆలయ రెనవేషన్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. దాతల సహకారంతో భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన గుట్టపైన ఆలయం పక్కన కల్యాణ మండప నిర్మాణం, అందులో సీసీ ఫ్లోరింగ్, శ్రీగోకులం నుంచి ఆర్చ్ వరకు సీసీ రోడ్డు పనులను గురించి చర్చించారు. వాటిని త్వరలో చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. సమావేశంలో ఆలయ ఈవో శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

రక్తకణాలు దానం



రక్తకణాలు దానం చేస్తున్న సుశాంత్

నెన్నెల: మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితుల్లో డెంగీ జ్వరం సోకిన ఓ యువకుడికి రక్తకణాలు అవసరం ఏర్పడింది. శుక్రవారం మంచిర్యాలలోని జనని బ్లడ్‌బ్యాంక్ వారు ఫోన్ చేయగా నెన్నెలకు చెందిన శ్రీరాంభట్ల సుశాంత్‌శర్మ డెంగీ జ్వరంతో బాధపడుతున్న లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల చెందిన సప్ప సాయికుమార్ రక్తకణాలు దానం చేసి ప్రాణం కాపాడారు. రక్తకణాలు 10 వేలకు తగ్గి దిక్కుతోచని స్థితిలో ఉన్న యువకుడికి రక్తకణాలు అందించి కుటుంబానికి అండగా నిలిచాడు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉన్నవారు 8555899987 నంబర్‌కు కాల్ చేయాలని సుశాంత్ సూచించారు.

ఐఎంఏ అధ్యక్షుడికి సన్మానం



రమణను సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ రమణను బీసీ యువజన సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో శుక్రవారం సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సభ్యుడు శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీం రవి, శ్రీరాంపూర్ ఏరియా నాయకులు రాజన్న బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కార్యదర్శి చంద్రమౌళి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, సామాజిక సేవకుడు సందేశ్‌గుప్తా పాల్గొన్నారు.

'చెన్నూర్‌కు చేసిందేమీ లేదు'



మాట్లాడుతున్న రాజ్‌కుమార్, రాజ్‌కుమార్

భీమారం: మూడుసార్లు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా పనిచేసిన నల్లాల ఓదెలు చెన్నూర్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ద్వారా ఓదెలు ఆయన భార్య భాగ్యలక్ష్మి పదవులు పొంది నేడు పార్టీని విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఓదెలు గురించి నియోజకవర్గ ప్రజల్లో చర్చ జరుగుతుందన్నారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నేతృత్వంలో చెన్నూరు అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు పవన్, బొల్లం శ్రీనివాస్, శ్రీకాంత్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీలో గేదె విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లగిశెట్టి మల్లేశ్‌కు చెందిన గేదె మేత కోసం వెళ్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న ఎర్త్ వైర్ తగలడంతో మృతిచెందింది. దీని విలువ రూ.60 వేలు ఉంటుందని యజమాని తెలిపాడు. అధికారులు నష్టపరిహారం అందించాలని ఆయన కోరాడు.

'ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి'

మంచిర్యాలఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా పేకాటడుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. సోషల్‌మీడియాలో పేకాడుతున్న దృశ్యాలు చక్కర్లు కొట్టాయని, విచారణపేరిట కాలయాపన చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నేతకాని సంఘం నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు

- ప్రభుత్వ పాఠశాలల్లో చాలాచోట్ల అంతే
- బిల్లులు రావడం లేదంటున్న కాంట్రాక్టర్లు
- మన ఊరు–మనబడి పనుల్లో జాప్యం



తాళ్లపేట ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా డైనింగ్‌హాల్



తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా తరగతి గది నిర్మాణం

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం మన ఊరు–మనబడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకోసం ప్రతిపాదనలు రూపొందించింది. పాఠశాలలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర దాటిన కొన్నిచోట్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా కొన్నిచోట్ల అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. మరికొన్నిచోట్ల పనులు చివరి దశకు చేరాయి. వేసవి సెలవుల్లో పనులు పూర్తిచేయాలని కార్యచరణ రూపొందించారు కానీ అది సాధ్యం కాలేదు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాకపోవడంతోనే పనుల్లో జాప్యం, పనులు నిలిచిపోవడం జరుగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో 19 పాఠశాలలు..

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మామిడిపల్లిలో ఉన్నత, ప్రాథమిక, దొరగారిపల్లె ప్రాథమిక, పెద్దపేట ప్రాథమిక, మొకాశిగూడ ప్రాథమిక, తాళ్లపేట ఉన్నత, ప్రాథమిక, లింగాపూర్ ప్రాథమికోన్నత, వెల్గనూర్ ఉన్నత, ప్రాథమిక, గూడెం ప్రాథమిక, రెబ్బనపల్లిలో ఉన్నత, ప్రాథమిక, నంబాల ప్రాథమిక, గుడిరేవులో ప్రాథమిక, ఉన్నత, లక్ష్మీకాంతపూర్‌లో ప్రాథమికోన్నత, రంగపల్లిలో ప్రాథమిక పాఠశాలను మన ఊరు–మనబడిలో ఎంపిక చేశారు. ఇందులో పెద్దపేట, మామిడిపల్లిలో పనులు పూర్తవగా, వాటిని వినియోగిస్తున్నారు. మిగిలిన కొన్నిచోట్ల అసంపూర్తిగా, మరికొన్ని చోట్ల చివరి దశకు చేరుకున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణాలను బట్టి బిల్లులు అందించి పనులు త్వరగా పూర్తిచేయాలని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో రవీందర్‌ను సంప్రదించగా, మన ఊరు–మనబడిలో జరుగుతున్న పనులకు నిర్మాణాలను బట్టి బిల్లులు వస్తున్నాయని చెప్పారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

- జైపూర్ ఏసీపీ మోహన్



పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ

చెన్నూర్: గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని జైపూర్ ఏసీపీ మోహన్ అన్నారు. పట్టణంలో పలు గణేశ్ మండపాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం గణేశ్‌లను నిమజ్జనం చేసే పెద్ద చెరువును మున్సిపల్, రెవెన్యూ, ఫైర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈనెల 26న పట్టణంలో నిమజ్జనం జరగనుందన్నారు. నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ముందుగానే రూట్‌మ్యాప్ తయారు చేసుకోవాలని సూచించారు. చెరువు వద్ద గణేశ్‌లు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు నిమజ్జనం చేసేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఐ వాసుదేవరావు, ఆర్‌ఐ తిరుపతి, ట్రాన్స్‌కో, ఫైర్ అధికారులు ఉన్నారు.

నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్

దండేపల్లి: నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లక్సెట్టిపేట సీఐ కృష్ణ తెలిపారు. మండలంలోని బీహారూన్‌గూడలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించి, ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్సై ప్రసాద్, స్పెషల్‌పార్టీ పోలీసులు ఉన్నారు.

సన్మానం

బెల్లంపల్లి: రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియామకమైన బెల్లంపల్లికి చెందిన రేణికుంట్ల ప్రవీణ్‌కు శుక్రవారం ఆత్మీయ సన్మానం జరిగింది. బూడిదగడ్డబస్తీలో ప్రవీణ్ ఇంటికెళ్లి ప్రజాసంఘాల బాధ్యులు, బీఆర్‌ఎస్ శ్రేణులు సత్కరించారు.

'మాదిగలను మోసం చేసిన బీజేపీ'

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య ఆరోపించారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ అంశంపై ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి లేని పార్టీలకు మాదిగలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, ఎంఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సతీశ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ మల్లేశ్ పాల్గొన్నారు.

సామాన్యుడి సమరభేరిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాగేంద్రప్రసాద్

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లో ఈనెల 24న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సామాన్యుడి సమరభేరి సభను విజయవంతం చేయాలని జిల్లాకన్వీనర్ నల్ల నాగేంద్రప్రసాద్ కోరారు. జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి సోమ్‌నాథ్ భారతి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సభలో ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతామన్నారు. నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. జిల్లా జనరల్ సెక్రెటరీ నయీంపాషా, విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ కొంటు రాజు, నాయకులు పల్లికొండ విజయ్, సంతోష్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

జన్నారం: బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు కిష్టాపూర్ శాఖ మేనేజర్ రాజుకుమార్ సూచించారు. కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాబార్డు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు సేవలను కళాజాత బృందం పాటల రూపంలో వివరించారు. మెజిషియన్ మ్యాజిక్ షోతో అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం జాడి మురళి, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



లక్సెట్టిపేట: పాల్గొన్న మహిళలు



నస్పూర్: పూజలో పాల్గొన్న మహిళలు



తాండూర్: పూజ చేస్తున్న మహిమలు



భీమారంలో పాల్గొన్న మహిళలు



గౌతమేశ్వర కాలనీలో..

మంచిర్యాలఅర్బన్/భీమారం/లక్సెట్టిపేట/నస్పూర్/తాండూర్: వినాయక నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మంచిర్యాల జిలాకేంద్రంలో గౌతమేశ్వర కాలనీ గణేశ్ మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. గోసేవా మండలిలో స్నేహ గణేశ్ మండలి వద్ద భక్తులు అన్నదానం చేపట్టారు. భీమారంలోని ఐబీ వినాయక మండలి వద్ద కుంకుమపూజల్లో మహిళలు పాల్గొన్నారు. లక్సెట్టిపేటలోని 14 వార్డులో అన్నదానం, నోములవాడలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. 56 రకాల నైవేద్యాలను వినాయకుని సమర్పించారు. కౌన్సిలర్ చింత సువర్ణ, నిర్వాహకులు తోట సత్తయ్య, రమేశ్, సుదర్శన్, శ్రీధర్ ఉన్నారు. నస్పూర్ కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయంలో కుంకుమపూజలో మహిళలు పాల్గొన్నారు. తాండూర్ శ్రీభక్త మార్కండేయ శివాలయంలో గణేశ్ మండపం వద్ద కుంకుమ పూజ, అన్నదానం నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఏజెన్సీ ప్రాంతం అయినప్పటికి 1/70 చట్టం తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభాకర్‌రావు అనే వ్యక్తి 52/3అ సర్వేనంబర్‌లో 1/70 చట్టానికి విరుద్ధంగా మూడు అంతస్తుల భవనం నిర్మాణం చేపట్టారని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నక రాజు, గిరిజన సొసైటీ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కుర్సింగ నాగేశ్వరరావు, సోమని మల్లేశ్, సిడాం శంకర్ ఉన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా రాజేశ్



రాజేశ్‌కు నియామకపత్రం ఇస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన న్యాయవాది సిరిపురం రాజేశ్‌ను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ శుక్రవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మంచిర్యాల పట్టణంలోని గౌతమీనగర్ నివాసి, మాజీ ఉపసర్పంచ్ ముక్కెర మొగిలి శుక్రవారం కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురం రాజేశ్, హాజీపూర్ మండల రైతుబంధు సమితి నాయకుడు పూస్కూరి శ్రీనివాసరావుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు బెల్లంకొండ మురళి, సింగతి మురళి, బొడ్డు శంకర్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ శంకర్‌రావు, నాగేశ్వర్‌రావు, సుమోహన్, తిరుపతి, జితేందర్‌రావు, శిల్ప, సంజయ్‌కుమార్, సతీశ్‌రావు, మల్లేశ్, శ్యాంసుందర్, చంద్రమొగిలిరెడ్డి పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థికసాయం

తాండూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారికి వైద్యం అందించడానికి యువ భారత్ శక్తి ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్థికసాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. మండలంలోని చౌటపల్లికి చెందిన పోగుల తిరుపతి రెండేళ్ల వయస్సు ఉన్న వేదశ్రీ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేదు. విషయం తెలుసుకున్న నిర్వాహకులు దాతల నుంచి సేకరించిన విరాళాలు రూ.16 వేలను శుక్రవారం చిన్నారి తండ్రి తిరుపతికి అందజేశారు. జీవన్‌కుమార్, రోషన్ కుమార్, నందు, రాకేశ్, వెంకటేశ్, హరీశ్, సురేష్, సాయికుమార్, రఘు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్యశిబిరం

లక్సెట్టిపేట: అయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ ఫిజిషియన్, సర్జన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఈఎన్‌టీ తదితర ప్రత్యేక వైద్యులు హాజరై వైద్య పరీక్షలు చేశారు. మండలాల ప్రజలు వైద్య పరీక్షలు చేసుకున్నారని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం

లక్సెట్టిపేట: మండలంలో లిట్రాన్ ఇండియా సహకారంతో, విలివర్స్ కాంపాషన్, మినిస్ట్రీస్ ట్రస్టు ఆధ్వర్యంలో 20 వయోజన విద్యా కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ ఒడ్డెటి శ్రీనివాస్, దైవసేవకులు బొడ్డు రవి, జోసఫ్, ఏసన్న, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ ప్రారంభం

కాసిపేట: మండలంలోని చిన్నధర్మారంలో శుక్రవారం బోర్‌వెల్ ప్రారంభించినట్లు విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. నీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు బోరు మరమ్మతు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవడంతో సమకూర్చినట్లు ఏఈ తెలిపారు. వైస్ ఎంపీపీ విక్రంరావు, సర్పంచ్ భుక్య సునిత, నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాసిపేట: ముత్యంపల్లిలో బీజేపీ నాయకుడు బాకీ నరేశ్ తండ్రి ఇటీవల మృతిచెందగా, దేవాపూర్‌కు చెందిన చునార్కర్ గణేశ్ గురువారం మృతిచెందారు. బాధిత కుటుంబాలను బీజేవైఎం జిల్లాఅధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ శుక్రవారం పరామర్శించారు. ఇరు కుటుంబాలకు 25 కిలోల బియ్యం బ్యాగులు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ సంతోష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజలింగు ఉన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

చెన్నూర్: చిరుధాన్యాలు తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో మనోరమ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో పోషణమాసంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు శుక్రవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఏపీఎం ప్రమీల, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

జైపూర్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని జెడ్పీటీసీ సునిత తెలిపారు. నర్సింగాపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ బుచ్చమ్మ, ఎంపీటీసీ స్వాతి, సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

'స్థల ప్రాంగణం ఆక్రమణకు యత్నం'

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు నుంచి రామకృష్ణాపూర్ వైపు వెళ్లే రోడ్డు పక్కన గతేడాది ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ స్థల ప్రాంగణాన్ని సమీప వ్యాపారి ఆక్రమించేందుకు యత్నించాడు. విషయం తెలుసుకున్న మహిళలు శుక్రవారం అడ్డుకోగా వ్యాపారి దురుసుగా ప్రవర్తించాడు. మహిళలు మాట్లాడుతూ ఆ స్థలంలో కొన్నేళ్లుగా బతుకమ్మ ఆట, గణేశ్ నవరాత్రోత్సవాలు జరుపుకుంటామని వివరించారు. సదరు వ్యాపారి మాంసపు వ్యర్థాలను అక్కడ పడేస్తూ కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటున్నారని మండిపడ్డారు. స్థలం ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వేంపల్లిలో డ్రైడే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని వేంపల్లిలో శుక్రవారం మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. అనుమానితులకు ఉచిత వైద్యపరీక్షలు జరిపారు. సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ స్వరూప, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ పాల్గొన్నారు.

వంటసామగ్రి విరాళం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేంపల్లి గ్రామంలోని శ్రీభక్తాంజనేయ సహిత శ్రీశివకేశవ ఆలయానికి భక్తుడు రాయిలి పద్మ–మల్లేశ్ దంపతులు వారి తల్లిదండ్రులు రాయిలి బుచ్చవ్వ–రాజంల జ్ఞాపకార్థం రూ.30 వేల విలువ గల వంట సామగ్రిని శుక్రవారం విరాళంగా అందజేశారు. సర్పంచ్ శారద, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరెల పంపిణీ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రెడ్డికాలనీ, సంజీవయ్య కాలనీ, వైశ్యభవన్, వడ్డెర కాలనీ, ఐబీ ఏరియాల్లో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ శుక్రవారం బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా మహిళలకు బతుకమ్మ పండుగకు చీరలు కానుకగా అందిస్తున్నామని తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు 60 శాతం కేటాయించాలి

మందమర్రిరూరల్: చట్టసభల్లో బీసీలకు అన్ని పార్టీలు 60 శాతం సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల సతీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశం జన,గణన ప్రకారం బీసీలు 60 శాతం ఉన్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ అమలు చేసే వరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. మాల్, శ్రీనివాస్, చోటు, అశోక్ రాకేశ్, రాజయోగి రాజు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే ఎస్సీ, ఎస్టీ కమిషన్

వేమనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్లుగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) పోరాట ఫలితంగానే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ప్రభుత్వం నియమించిందని జిల్లా కార్యదర్శి మోహన్ అన్నారు. శుక్రవారం వేమనపల్లిలో నూతనంగా ఎన్నికైన కమిటీకి అభినందన సభ నిర్వహించారు. దళితులపై జరుగుతున్న దాడులను నిరోధించడానికి ఈ కమిటీ రాజకీయాలకు అతీతంగా రక్షణ కేంద్రంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మనసు మార్చాలని పూజలు

తాండూర్: అంగన్‌వాడీల సమస్యలు తీర్చడానికి సీఎం కేసీఆర్ మనసు మార్చాలని మాదారం టౌన్‌షిప్‌లో భూలక్ష్మీ విఘ్నేశ్వర స్వామికి పలువురు టీచర్లు, ఆయాలు పూజలు చేసి గణపతిని వేడుకున్నారు. పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఏకలవ్య ఆశ్రమానికి చేయూత



రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న శ్రీహర్ష

మంచిర్యాలటౌన్: పేద గిరిజన విద్యార్థుల కోసం పనిచేస్తున్న పట్టణంలోని ఏకలవ్య ఆశ్రమానికి అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మంచిర్యాలకు చెందిన అట్లూరి సత్యనారాయణ, రమ దంపతుల కుమారుడు శ్రీహర్ష రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. ఈ విరాళాన్ని వంట షెడ్డు నిర్మాణం కోసం వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా సంచాలక్ బద్రి నారాయణ, ఏకలవ్య ఆవాస కమిటీ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావుతోపాటు కృష్ణభాస్కర్, బౌద్ధిక్ ప్రముఖ్, నిర్వాహకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు. జీఎం కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి మహిళా ఉద్యోగులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, బీఎంఎం వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, పార్టీ పట్టణ కన్వీనర్ రమేశ్, నాయకులు మొగిలి, చక్రవర్తి, వెంకటేశ్, రాజు, సాగర్, రాజు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

జన్నారం: పొనకల్‌లో డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులు డంపింగ్ యార్డు పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీవో రమేశ్, ఈవో రాహూల్ ఉన్నారు.